సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 5-9-2024

సంపుటి: 20 సంచిక: 140

పేజీలు: 4 వెల: రూ.1

## సందడిగా పద్మావతి కళాశాల ఫ్రెషర్స్ డే



(సత్యంన్యూస్, నరసన్నపేట)

విద్యార్థులు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ పల్లి సూరిబాబు అన్నారు. గురువారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న జ్ఞానం పదిమందికీ ఉపయోగపడుతూ సమాజహితం కావాలన్నారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రేపటి రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మాకేన సతీష్, మెండ మోహన్‌దాస్, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపక, విద్యార్థుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా సాగాయి.

## కమిషనర్ బాధ్యతల స్వీకరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

నగర కార్పొరేషన్ కొత్త కమిషనర్ దుర్గాప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించిన ఓబులేసుకు సుడా వీసీగా బదిలీ కావడంతో రెండు రోజుల నుంచి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వ్యవహరించారు. గురువారం దుర్గా ప్రసాద్‌కు ఆయనే బాధ్యతలు అప్పగించారు. అంతకు క్రితం ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.




# సిక్కోలు నషాళానికి గంజాయి నిషా!





- నగరంలో పెరుగుతున్న అమ్మకాలు, సేవనం
- ఆ మత్తులో విచక్షణ కోల్పోతున్న యువత
- పెరుగుతున్న నేరాలు.. అమాయకులపై దాడులు
- అరెస్టులు చేస్తున్నా మూలాలు పట్టుకోలేకపోతున్న పోలీసులు
- కొత్త ఎస్పీ సంకల్పంతోనైనా ఈ పీడ వదులుతుందా?

▸ ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు కోన దిలీప్‌కుమార్ (25). నగరంలోని గూనపాలెంలో తల్లితో పాటు నివాసముంటున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లే పని చేస్తూ పెంచింది. గంజాయి అతని జీవితాన్ని చిత్తు చేసింది. అది లేకుండా ఒక్కరోజు కూడా బతకడం సాధ్యంకాని పరిస్థితికి వెళ్లిపోయాడు. గంజాయి దొరక్కపోతే మత్తునిచ్చే మాత్రలనే బఠాణీల్లా నమిలేసి మెంటలెక్కిపోయాడు. ఆ మత్తులోనే వన్‌టౌన్ పరిధిలో కొన్ని నేరాలకు పాల్పడ్డాడు. సీన్ కట్ చేస్తే.. ప్రస్తుతం బరంపురం వద్ద ఉన్న నిషా నివారణ కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. శ్రీకాకుళం జీజీహెచ్‌లో, విశాఖపట్నం మెంటల్ ఆస్పత్రిలో చూపించినా ఫలితం లేకపోవడంతో బరంపురం సమీపంలోని కొనిశి గ్రామంలో ఉన్న ఈ కేంద్రంలో ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాడు.

▸ ఆదే గూనపాలేనికే చెందిన మరో యువకుడి పేరు ప్రశాంత్. గంజాయి మత్తులో అనేక అరాచకాలకు పాల్పడ్డాడు. గంజాయి సేవించిన తర్వాత విచక్షణ జ్ఞానం కోల్పోయి ఏం చేస్తున్నాడో తెలియని స్థితిలో కొద్ది రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన మణి అనే వ్యక్తిపై దాడి చేసి అతని బుర్ర బద్దలుకొట్టాడు. పోలీసులు తన కోసం వెతుకుతుండటంతో అప్పటినుంచి పరారీలో ఉన్నాడు.

▸ తుమ్మావీధికి చెందిన జగన్నాథం ఇటీవల డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళుతుండగా పక్కనుంచి ఒక యువకుడు ద్విచక్ర వాహనం పై వెళ్తూ తల మీద గట్టిగా మోదడంతో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అసలు జగన్నాథానికి, ఆయనపై దాడి చేసిన యువకుడికి కనీసం ముఖపరిచయం కూడా లేదు. కేవలం గంజాయి ఇచ్చిన ఉద్రేకంతో చేసిన చర్య ఇది.

▸ వారం రోజుల క్రితం కంపోస్ట్ కాలనీ వద్ద రోడ్డు మీదే వెల్డింగ్ సిలెండర్ పెట్టి దాని వైర్లను రోడ్డు మీద పడేయడంతో ఎవరైనా కాలికి తగిలి పడిపోతారని చెప్పిన పాపానికి ఒక యువకుడి బుర్ర బద్దలుగొట్టేశారు. ఆ యువకుడి రిమ్స్ క్యాజువాలిటీలో చికిత్స తీసుకున్న ఆ యువకుడు కేసు పెట్టాలని భావించినప్పటికీ గంజాయి బ్యాచ్ చంపేస్తామని వార్నింగ్ ఇవ్వడంతో వెనక్కు తగ్గిపోయాడు.

## క్రైమ్ కథాచిత్రాలు.. గంజాయి గాథలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

..ఇలా చెప్పుకుంటూపోతే నగరంలో వెలుగులోకి రానివి, పోలీసుల వరకు చేరని గంజాయి దాడులు కోకొల్లలు. గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి పెద్దగా శిక్షలు పడే అవకాశం లేకపోవడంతో పోలీసులు కూడా గంజాయి మత్తులో న్యూసెన్స్ చేసిన వారి పట్ల ఇన్నాళ్లూ ఉదాశీనంగా వ్యవహరించారు. ఫలితంగా నగరంలో గంజాయి బ్యాచ్ విచ్చలవిడితనం పెరిగిపోయింది. అయితే కొత్త ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి దీన్ని ఒక సవాల్‌గా తీసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి సేవించినవారిని, విక్రయిస్తున్నవారిని విడిచిపెట్టకూడదన్న ధ్యేయంతో ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో జిల్లా నలుమూలలా సోదాలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం నగరం పెద్దదిగా ఉండటం వల్ల గంజాయి మూకలను అదుపులోకి తేవడం ఇప్పటికిప్పుడే సాధ్యం కాకపోయినా ఎస్పీ పంతం పట్టి దాడులు కొనసాగిస్తే అసాధ్యం - మిగతా 4లో

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, ఉత్తమ పౌరులుగా, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జామి భీమశంకర్ అన్నారు. గురువారం టీచర్స్‌డేను పురస్కరించుకొని ఇందిరావిజ్ఞాన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఆయన జీవిత గాథను, ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని, స్వామి వివేకానంద హితబోధలను, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవిత విజయాలను వివరించారు. ప్రత్యేక అతిథిగా జబర్దస్త్ వినోద్ పాల్గొని పిల్లలను ఉత్తేజపరిచే కార్యక్రమాలు చేసి అలరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రౌతు శ్రీనివాసరావు, వీటీ నాయుడు, జే.సంపత్ కుమార్, పి.కిరణ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## శర్వాణిలో ఉపాధ్యాయ దినోత్సవం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ అజ్ఞానం అనే చీకటిని తొలగించినవారే ఉపాధ్యాయుడని, అటువంటి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన అపర సరస్వతీ పుత్రులు సర్వేపల్లి అని అన్నారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కోటబొమ్మాళి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం డబ్బీరు గోవిందరావును ఘనంగా సన్మానించారు. హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల ఉత్తమ వ్యక్తులను తయారుచేయడానికని భావించి బోధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందినవారికి యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తగ్గిన వృద్ధిరేటు ఏం చెప్తోంది?






"ఎక్యూట్ రేటింగ్స్ అనే సంస్థకు చెందిన ప్రధాన ఆర్థికవేత్త దీని గురించి చెప్తూ 6.7 శాతపు వృద్ధి రేటు మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఉందని, దీని గురించి భయపడవలసిన పని లేదని అన్నారు."




- ఈ ఏడాది మొదటి త్రైమాసంలో 6.7 శాతం వృద్ధి
- గత పదిహేను నెలల్లో కెల్లా తక్కువ రేటు నమోదు
- అయినా ప్రపంచంలో అత్యంత వృద్ధి నమోదు

జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించిన వివరాల ప్రకారం దేశ ప్రస్తుత వృద్ధి రేటు 6.7గా తేలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సవరించిన అంచనాల ప్రకారం 7.2గా ఉండాల్సిన వృద్ధిరేటు యధార్థానికి తగ్గింది. ఇలా తగ్గడానికి కారణం ఏమైవుంటుందని ఆర్బీఐ ఇప్పడు ఏవో అంచనాలు వేస్తోంది. కాని వాస్తవాలు వాస్తవాలే.

గడచిన నెల వెళ్తూ వెళ్తూ దేశ ప్రజలకు వింత కబురు ఒకటి చెప్పి వెళ్లిపోయింది. ఈ ఏడాదిలో మొదటి త్రైమాసికానికి భారతదేశపు వృద్ధి రేటు గురించి నిరాశాజనకమైన కబురు చెప్పింది. గత ఏడాదిన్నరగా ఎన్నడూ చూడనంత తక్కువ జిడిపి వృద్ధి రేటు నమోదైందని తేలింది. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించిన వివరాల ప్రకారం దేశ ప్రస్తుత వృద్ధి రేటు 6.7గా తేలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సవరించిన అంచనాల ప్రకారం 7.2గా ఉండాల్సిన వృద్ధిరేటు యధార్థానికి తగ్గింది. ఇలా తగ్గడానికి కారణం ఏమైవుంటుందని ఆర్బీఐ ఇప్పుడు ఏవో అంచనాలు వేస్తోంది. కాని వాస్తవాలు వాస్తవాలే. ప్రధానంగా వ్యవసాయ అభివృద్ధి సన్నగిల్లడం వల్లనే వృద్ధిరేటు కుదేలైందని తేల్చిచెప్తోంది. మరి వ్యవసాయం ఎందుకు దిగజారిందనే దానికి కారణాలు ఆర్బీఐ చెప్పదు. ఎందుకంటే అది దాని పని కాదు. ఆ జవాబు చెప్పాల్సింది ప్రభుత్వం. ఈసారి 'నైరుతి' పుష్కలంగా నీరు అందించినప్పటికీ వ్యవసాయం నానాటికీ తీసికట్టు నాగంభొట్టు ఎందుకు అవుతోందో ఎవరు తేలుస్తారు?

గత ఏడాది ఇదే సమయానికి 8.2 శాతం వృద్ధి చూపించింది. దానికి కారణం మనకు తెలిసిందే. ఎన్నికల వేళలో భారత ప్రభుత్వం అంచనాలను పెంచి తయారుచేసుకున్న వృద్ధిగానే దానిని మనం భావించాలి. అయితే ప్రభుత్వానికి గొప్ప ఉపశమనం ఏమిటంటే ఇప్పుడు మనం




ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. దానికి కారణం మన బలంతో పాటు ప్రత్యర్థుల బలహీనత కూడా. అమెరికాలో ఆర్థిక మాంద్యం నెలకొనడం, చైనాలో వృద్ధిరేటు మరింత మందగించడం మనకు ప్లస్ పాయింట్లయ్యాయి. ప్రస్తుతం ఈ పావు ఏడాదిలో చైనా వృద్ధిరేటు 4.7 శాతంగా నమోదైంది. మనకంటే బాగా తక్కువ వృద్ధి జరుగుతున్నట్టు గోచరిస్తోంది. చైనా రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఒడిదుడుకులు దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. నిజానికి దలాల్ స్ట్రీట్ అంచనాల ప్రకారం మన వృద్ధిరేటు మరింత మెరుగ్గా ఉండాలని అంచనావేశారు. పూర్తి వేగంతో ఎనిమిది దాటుతుందని లెక్కలు కట్టారు. అయితే ఆ అంచనాలకు చేరుకోలేకపోయాం. దానికి కారణం ప్రధానంగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులుగానే పరిశీలిస్తున్నారు.

### వ్యవసాయానికి సాయమే మనకు రక్ష

ద్రవ్య విధాన కమిటీ (మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి)) సమావేశానికి వెళ్తూ, చివరి నిమిషంలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు ఊపందుకుని గ్రామీణ వినిమయం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. గడచిన పదకొండేళ్లలో ఎన్నడూ లేనంతగా ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు పెరిగాయని సంతృప్తి వ్యక్తం చేశారు. 'ద్రవ్యోల్బణానికి విరుగుడుగా చేయాల్సిన పనులన్నీ ప్రస్తుతం ఆశాభావంగా కనిపిస్తున్నాయి. ఆహ్లాదకరమైన రుతుపవనాలు, ఖరీఫ్ విత్తులో క్రమమైన మెరుగుదల, రిజర్వాయర్లలో నిండుగా నీరుండడం మొదలైనవన్నీ రబీ దిగుబడులపై ఆశలు రేకెత్తిస్తున్నాయి' అని శక్తికాంత్ దాస్ చెప్పారు. ధరల స్థిరీకరణకు తోడుగా సరైన ద్రవ్య విధానం అవలంబిస్తే ఆయన ఆశించిన ఫలితాలు తప్పక సమకూరుతాయని రైతాంగ నిపుణులు అంటున్నారు. అయితే ఈ వృద్ధి రేటు విషయంలో మార్కెట్ నిపుణుల అంచనాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. ఉదాహరణకు ఎక్యూట్ రేటింగ్స్ అనే సంస్థకు చెందిన ప్రధాన ఆర్థికవేత్త దీని గురించి చెప్తూ 6.7 శాతపు వృద్ధి రేటు మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఉందని, దీని గురించి భయపడవలసిన పని లేదని అన్నారు. గత ఏడాది చివర్లో రైతులకు ఇచ్చిన ఎరువులు, విత్తనాల సబ్సిడీల లెక్కలు అంచనాలలో చేరి వృద్ధి తగ్గినట్టు నమోదయిందని చెప్పారు. ఎన్నికల సమయంలో స్తబ్దుగా ఉన్న నిర్మాణ రంగం ఇప్పుడు నెమ్మదిగా జోరందుకుని 10.5 శాతం వృద్ధి చూపించడం చాలా ఆశావహకంగా ఉందని ఆయన అంటున్నారు. జిడిపిలో చాలా కీలకమైనవని ఎగుమతులని, ఇప్పుడు ఈ ఎగుమతులలో తగినంత వృద్ధి చూపించడం మరింత శుభ సూచకమని తెలిపారు. దేశీయ ఎగుమతులలో 8.7 శాతం వృద్ధి రేటు సాధారణ విషయం కాదన్నారు.

నిజానికి జిడిపి వృద్ధి రేటు ధరల పెరుగుదలను గాని, మరే ఇతర విషయాలను గానీ ప్రభావితం చేయదు. కేవలం దేశ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడానికి తప్ప మరి దేనికీ ఉపయోగపడదు. ముఖ్యంగా సామాన్యులకు పట్టని విషయం ఇది. అయినప్పటికీ వృద్ధిరేటు పెరుగుదల బలోపేతమైన ఆర్థిక వ్యవస్థను తయారుచేస్తుందన్న ఆశతో మాత్రమే దీనిని అధ్యయనం చేయాలి. పివి నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పటి నుంచి దేశ జిడిపి రెండంకెల సంఖ్యకు చేరవేయాలని చేయని ప్రయత్నం లేదు. మన్మోహన్ సింగ్ హయాంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు ఊపందుకుని అందరిలో ఆశలు మోసులెత్తించినప్పటికీ వాస్తవ రూపం దాల్చలేదు. ప్రధానిగా నరేంద్రమోదీ ఆర్థిక వృద్ధి రేటు పన్నెండుకు చేర్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గత పదేళ్లలో అందుకు జరుపుతోన్న కృషి ఫలితాలు ఇస్తున్నట్టు కనిపించడం లేదు. మన దృష్టి మిగిలిన వాటన్నింటిపై కంటే అంటే పరిశ్రమలు, కార్పొరేట్లు, ఎగుమతులు, నిర్మాణరంగం, రియల్‌ఎస్టేట్ వంటి వాటికంటే, వ్యవసాయం, దీని అనుబంధ రంగాలపై పెడితేనే వాస్తవిక వృద్ధి రేటు సాధించి దేశాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందించవచ్చని ఈ ఏడాది విశ్లేషణలు మరోసారి నిరూపిస్తున్నాయి.

- దుప్పల రవికుమార్

● ఎడిటోరియల్

## బుడమేరు, కొల్లేరు ఆక్రమణలతోనే బెజవాడకు ముప్పు

బుడమేరును గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా సర్కారు పట్టించుకోకపోవడం వల్లే విజయవాడ ముంపునకు గురైందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అదే తరహా వ్యాఖ్యలు చేశారు. అటు వైకాపా అధినేత వైఎస్ జగన్ భారీ వర్షాలతో కృష్ణానదికి, బుడమేరుకు వరద పోటెత్తవచ్చని ముందస్తు సమాచారం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విఫలమైందని, దాని ఫలితంగానే భారీ నష్టం, జనం కష్టాలు పెరిగాయని విమర్శించారు. అధికార ప్రతిపక్షాలు ఇలా పరస్పరం బురద చల్లుకుంటూ వరద రాజకీయాలు చేస్తుండటం విచారకరం. రాజకీయ ఆరోపణల సంగతి పక్కన పెడితే విజయవాడ విలయానికి ప్రధాన కారణం ఏమిటన్నది ప్రధాన పక్షాల ఆరోపణల్లోనే తేటతెల్లమైపోయింది. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీకి స్థాయికి మించి వరద నీరు పోటెత్తడం వల్ల అటు గుంటూరు, ఇటు ఎన్టీఆర్ జిల్లా ముఖ్యంగా విజయవాడ తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతోపాటు విజయవాడ నగరం మీదుగా ప్రవహించే బుడమేరు కూడా విశ్వరూపం చూపించడం వల్లే పరిస్థితి విషమించింది. అటు కృష్ణమ్మ వరద, ఇటు బుడమేరు ప్రవాహం కలిసి బెజవాడను ముంచేశాయన్నది వాస్తవం. భారీ వర్షాలు, కృష్ణమ్మకు వరద పోటెత్తడం వంటి కారణాలను పక్కనపెడితే గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనిరీతిలో బుడమేరు ఉప్పొంగి విరుచుకుపడటానికి అన్ని ప్రభుత్వాల నిర్వాకమూ కారణమే. ఓ పక్క కృష్ణానది, మరోపక్క బుడమేరు వాగు.. మధ్య విజయవాడ నగరం.. ఇదీ భౌగోళిక స్వరూపం. ఎన్నడూ ఈ రెండూ ఒకేసారి విరుచుకుపడిన దాఖలాల్లేవు. కానీ ఈసారి కూడబలుక్కున్నట్లు రెండూ పోటెత్తడంతో బెజవాడ బెంబేలెత్తిపోయింది. గత నాలుగు రోజులుగా వరద నీటిలోనే మగ్గిపోతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతున్నా.. ఆ స్థాయిలో అనుకున్నంత వేగంగా నగరంలోని కాలనీలను ముంచేసిన వరద నీరు తగ్గడం లేదు. మరోవైపు కొంత శాంతించిందనుకుంటున్న బుడమేరు నీటిమట్టం బుధవారం మరోసారి నాలుగు అడుగుల మేర పెరిగింది. అది చాలదన్నట్లు మూడు చోట్ల వాగు గట్లకు గండ్లు పడటంతో వరద నీరు ఊళ్లలోకి చేరుతోంది. వరద అనుకున్న మేర తగ్గకపోవడానికి కారణం బుడమేరుతో పాటు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న కొల్లేరు ఆక్రమణలకు గురి కావడమే. బుడమేరు వాగు విజయవాడ నగరం మీదుగా 150 నుంచి 170 కిలోమీటర్లు ప్రయాణించి శాంతినగర్, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి ప్రాంతాల మీదుగా కొల్లేరు సరస్సులో కలుస్తుంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బుడమేరు వరద వేగంగా వెళ్లి కొల్లేరులో కలిసే పరిస్థితి లేదు. దీనికి ఏళ్ల తరబడి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం. 2005-06లో బుడమేరకు భారీ వరద వచ్చిన తర్వాత భవిష్యత్తులో దాని తీవ్రతను తగ్గించేందుకు బుడమేరు ప్రవాహాన్ని పోలవరం కుడి కాలువలోకి మళ్లించే ఏర్పాటు చేశారు. అలాగే కృష్ణానదిలోకి మొదటి నుంచీ వెళ్లి కలిసేది. అయితే ఇక్కడో సమస్య ఉంది. కృష్ణానదిలో వరద ఉధృతి అధికంగా ఉంటే బుడమేరు నీరు కృష్ణాలోకి వెళ్లకుండా వెనక్కి వచ్చేస్తుంది. అలాంటి సందర్భాల్లో విజయవాడ మీదుగా ప్రయాణించి కొల్లేరు సరస్సులో కలవాల్సి ఉంటుంది. అయితే దురదృష్టం ఏమిటంటే ఇక్కడ బుడమేరు, అక్కడ కొల్లేరులో గత కొన్నేళ్ల నుంచి ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయి. విజయవాడ నగర పరిధిలో బుడమేరు ప్రవాహమార్గం వెంబడి విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడి వందలాది ఇళ్లు, బహుళ అంతస్తుల భవంతులు నిర్మించేశారు. ఏకంగా అనేక కొత్త కాలనీలే పుట్టుకొచ్చేశాయి. ఫలితంగా వాగు ప్రవాహమార్గం కుచించుకుపోవడమే కాకుండా పూడికలతో లోతు తగ్గిపోయింది. మరోవైపు బుడమేరు వరద కలవాల్సిన కొల్లేరు సరస్సు కూడా ఆక్రమణల పాలై చాలా వరకు తన స్వరూపాన్ని కోల్పోయింది. కొల్లేరును ఆనుకుని ఉన్న కైకలూరు, ఆకివీడు, భీమడోలు, తదితర పట్టణాల్లో కొల్లేరు సరస్సు తీర ప్రాంత భూములను ఆక్రమించి మట్టితో పూడ్చేసి ఇళ్లు, ఇతర నిర్మాణాలు కట్టేశారు. మరోవైపు సరస్సులోనే ఎక్కడికక్కడ అడ్డుకట్టలు వేసి చేపలు, రొయ్యల చెరువులు తవ్వించేసి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. ఇటువంటి వ్యవహారాలను ప్రధానంగా ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా ఆయా ప్రాంతాల్లోని నాయకులందరూ తమ పలుకుబడిని బట్టి యధేచ్ఛగా అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తూ కొల్లేను చెరబట్టారు. కొల్లూరులో ఆక్రమణలు తొలగించడానికి, కాంటూరు లెవల్‌ను మెయింటెన్ చేయడానికి దాదాపు 20 ఏళ్ల క్రితం పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ చేపట్టి అక్రమ చేపల చెరువులు, ఇతర నిర్మాణాలను తొలగించేందుకు పూనుకున్నా, రాజకీయ ఒత్తిళ్లతో అది అసంపూర్తిగా నిలిచిపోయింది. అప్పటి నుంచీ మళ్లీ కొల్లూరు వైపు ఏ ప్రభుత్వం కూడా చూసిన పాపాన పోలేదు. బుడమేరుది అదే దుస్థితి. వీటి కారణంగానే విజయవాడను ముంచెత్తిన వరద రోజులు గడుస్తున్నా వెనక్కి పోకుండా తిష్టవేసింది. బుడమేరు ప్రవాహం అనుకున్నంత వేగంగా కొల్లేరు వైపు సాగడంలేదు. అలాగే ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల అక్కడికి చేరుకున్న నీటిని కొల్లేరు వేగంగా తనలోకి తీసుకోలేకపోతోంది. ఫలితంగా వరదలు సంభవించినా కొన్ని గంటల్లోనే వెనక్కి వెళ్లిపోవాల్సి నీరు రోజుల తరబడి ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రజల అవస్థలు రెట్టింపువుతున్నాయి. వరదల ఉధృతి తగ్గిన తర్వాత బుడమేరు ఆక్రమణలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని అంటున్నారు. చూడాలి మరి.. ఏమవుతుందో!



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని 31 డివిజన్ పరిధి దండివీధి మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్, సన్‌సైన్ స్కూల్లోని ఉపాధ్యాయులకు టీడీపీ ఇన్‌ఛార్జి సూరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రదీప్, నీరజ, సుధాకర్ నాగేశ్వరరావు, పార్వతి, టీడీపీ నాయకులు విభూది నమశివాయ, ఎస్.శ్రీనివాస రావులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్




ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు మధురా నగర్‌లోని భాష్యం స్కూల్‌లో ఉపాధ్యాయులను టీడీపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా శాలువ, సన్మాన పత్రం, కొబ్బరి మొక్కలను ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మండల మన్మధరావు, లొట్టి సూరిబాబు, మండల భరత్ తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్

## ఉపాధ్యాయులకు సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హయాతి నగరం మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్స్‌కు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు శాలువలు, సర్టిఫికెట్లతోపాటు కొబ్బరి మొక్కలను 43 డివిజన్ టీడీపీ నాయకులు బొల్ల నాగేంద్ర యాదవ్, 44వ డివిజన్ ఇన్‌ఛార్జి కవ్వాడి సుశీల, 45వ డివిజన్ ఇన్‌ఛార్జి నల్లాన మధు అందజేశారు. ఈ సందర్భంగా టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ టీచర్స్‌కు కూడా సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జిల్లా సంయుక్త కార్యదర్శి కోంద్రు వరప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.



## గురువును పూజించడం పూర్వజన్మ సుకృతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

గురువును పూజించడం పూర్వజన్మ సుకృతమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలులో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సింతు సుధాకర్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం, పేర్ల నరసింహమూర్తి, లంక గాంధీ, పైడిబాబు, ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం చంపాగల్లి వీధి అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ కల్యాణి, అంగన్వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన గర్భిణీ స్త్రీల పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమంలో కోరాడ హారగోపాల్, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి

(సత్యంన్యూస్, నరసన్నపేట)


పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని జిల్లా శిష్టకరణ సంఘ ప్రధాన కార్యదర్శి సదాశివుని క్రిష్ణ అన్నారు. గురువారం శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయగా, సగం అవిలింగి జేబీటీ పాఠశాల జె.మోహన్ గాంధీ, మిగతా ప్రతిమలు శిష్టకరణ సంఘం ప్రతినిధులు సమకూర్చారు. వీటన్నింటికి వినాయక వ్రతకథ పుస్తకాలు, కవర్లను స్థానిక సీఎంఆర్ అందజేసింది. కార్యక్రమంలో ప్రతినిధులు జానీ భాష, అంపలాం వసంత్, ఎంవీజే మోహనరావు, ఉరిటి జగన్నాథరావు, ఎస్.సింహాచలం, చౌదరి రవి, డబ్బీరు రవికుమార్, ఎంజీఎస్ రామచంద్రరావులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని, వారి శాస్త్రీయ దృక్పథం, సేవా దృక్పథం, తత్వచింతన, దేశానికి ఎంతో అవసరమని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన గురుపూజోత్సవ వేడుకను భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ప్రారంభించారు. భారత ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, రష్యాలో భారత రాయబారిగా, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతిగా డాక్టర్ సర్వేపల్లి అందించిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షులు పరమేశ్వరరావు పేర్కొన్నారు. అత్యుత్తమ మేధావి వర్గానికి తగిన గుర్తింపునివ్వడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, బాధ్యతలు అప్పగించినా, డాక్టర్ మన్మోహన్ సింగ్ లాంటి గొప్ప ఆర్థికవేత్తని ప్రధానమంత్రిగా చేసినా అది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు దంత త్రినాధరావును డీసీసీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి కృష్ణ, డి.గోవిందమల్లిబాబు, మంత్రి నరసింహమూర్తి, రెల్ల సురేష్, కరిమజ్జి మల్లేశ్వరరావు, ఆబోతుల వెంకటనాయుడు, జి.అప్పారావు, ఇజ్జురోతు రమణ, పి.రమేష్ కుమార్, దీర్ఘాసి వెంకటరావు, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల శ్రీకాకుళం ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సులో అతిథి అధ్యాపక పోస్టులకు సంబంధించి దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండి నెట్/సెట్/ పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదిన ఉదయం 10 గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలోని కెమిస్ట్రీ విభాగంలో హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



## కథలు వండడంలో

ఆ రోజుల్లో కె.వి రెడ్డిగారు కథను ఎలా వండేవారంటే.. ముందు రచయితను పిలిచి బాబూ వేరే పనులేం లేవు కదా.. ఉద్యోగం గట్రా ఏమన్నా ఉంటే ముందే చెప్పు.. నాతో కొంత కాలం ట్రావెల్ అవ్వాల్సొస్తుంది... ఇంట్లో బాదరబందీలు అవీ అన్నీ క్లియర్ చేసుకుని వచ్చేయ్ అన్జెప్పేవారు. నరసరాజుగారిని పెద్దమనుషులుకు తీసుకునే ముందు ఆయన అడిగిన ప్రశ్నలు ఆ రెండే.. పర్లేదండీ ట్రావెల్ అవుతాను.. ఇంటి బాదరబందీ నా మీద లేదు అన్జెప్పాకే ఆయన్ని తీసుకున్నారు.

# కేవీ రెడ్డి రూటే వేరు!

పింగళి బ్రహ్మచారి కనుక ఆయనతో కె.వికి ఎప్పుడూ ఇబ్బంది రాలేదు. అలా ఓ పాయింట్ అనుకుని దాని మీద రచయితతో కూర్చుని ఓ నాలుగు నెల్ల పాటు కథ వండేవారు. కథ ఓ షేపుకొచ్చేసిన తర్వాత స్టూడియోలోనో, తన ఇంట్లోనో పన్జేసే ఎవరినైనాను.. తన ఇంటి ముందు ఉండే టాక్సీస్టాండ్‌లోని డ్రైవర్ నెవరినైనానో..తో మొదలెట్టి మహిళలు పిల్లలతో సహా సమాజంలోని అన్ని తరగతుల నుంచీ ఒక్కో ప్రతినిధి ఉండేలా ఓ టీమ్ని తన ఇంటికి పిల్చి కూర్చోబెట్టి తాను తీయాలనుకుంటున్న సినిమా కథను వాళ్లకి పూసగుచ్చినట్టు చెప్పేవారట.

చెప్పేసి పంపేసి.. ఓ పదిహేను రోజులు గ్యాపిచ్చి రోజుకొక్కళ్లని పిల్చి నేనారోజు చెప్పానే కథ దాన్ని ఓ సారి నాకు చెప్పు అనేవారట. ఆ చెప్పేవారు తను చెప్పిన కథలో ఏ అంశాలను విస్మరించారు. ఏఏ అంశాల పట్ల తనను మించిన ఉత్సాహంతో మాట్లాడారు. ఇలాంటి పాయింట్లు అన్నీ రాసుకునేవారట.. అలా మొత్తం అంత మందితోనూ తిరిగి కథ ఒప్పచెప్పించుకున్న తర్వాత మళ్లీ రైటర్ ను పిల్చి కూర్చుని ఈ మేరకు రిపేర్లు చేసి ఫైనల్ డ్రాఫ్ట్ తయారు చేసేవారట. ఇలా కథ అనే ప్రక్రియ పూర్తయ్యాక డైలాగులు కుట్టించేవారు. ఆ డైలాగులు కుట్టేప్పుడు కూడా ఏ రోజు రాసిన డైలాగులు ఆ రోజే రివ్యూ చేసేసేవారట. డైలాగులు రాసేప్పుడు నటుడి కెపాసిటీని దృష్టిలో ఉంచుకుని వాడెక్కడ బలంగా ఉంటాడు. ఎక్కడ వీక్ గా ఉంటాడు అనేవి తెల్సుకుని మాటలు వేయమని చెప్పి ఆ మేరకు మార్పులు చేయించేవారట. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అప్పుడు ఆయన దృష్టిలో మేధావులు అనే బ్యాచొకటి ఉండేది. ఆ బ్యాచ్ లో పట్టాభి కూడా ఉండేవారు. ఇలా సినిమా బైట తన పరిచయస్తులు మిత్రులతో కూర్చుని ఇంకోసారి ఈ కథను డిస్కస్ చేసి ఫైనల్ టచప్ ఇచ్చి దాన్ని దగ్గర పెట్టుకుని కెమేరామెన్, కళా దర్శకుడు లాంటి టెక్నికల్ టీమ్‌తో కూర్చుని డిస్కషన్స్ పెట్టేవారట. కథలో మార్పులు సూచించమని వారినీ కోరేవారట. వస్తే వాటిని కూడా కలుపుకుని అప్పుడు కాస్టింగ్, బడ్జట్ వేసేవారట. ఆయన సినిమాకు ఎన్ని కాన్ల ఫిలిం పడుతుందని రాస్తే అంత పిలిమే వాడేవారట. అడుగు ఎక్కువ కాదు తక్కువా కాదు అన్నట్టు.. అసలు స్క్రిప్టులోనే ఆ సీను ఎన్ని నిమిషాల ఎన్ని సెకన్లు ఉండాలో కూడా రాసేసేవారట. ఇంత కసరత్తు చేయడం వల్లే అంత కాలం ఇండస్ట్రీలో ఉండీ పద్నాలుగు సినిమాలే తీయగలిగారు.

అదే మా దాసరి చూడండి నూటాభై తీసవతల పడేశారు.. డైరక్టరంటే అట్టా ఉండాలె.. నేను చెప్పింది చాలా తక్కువ సెట్స్ మీదకు వెళ్లే ముందు ఆయన చేసే కసరత్తు చాలా ఉండేదట. ప్రతి పాత్రకి స్కెచెస్ వేయించి వాటిని మార్చి పాటలు సంగీతం దగ్గర నుంచీ ఇలానే బోల్డు టైమ్ తీసుకుని సెట్స్ మీదకు వచ్చేవాడు. చాదస్తం అని తిట్టుకున్నా..

- రంగావఝ్ఝుల భరద్వాజ

## నాని.. బ్రేకింగ్ బ్యాడ్




'ఐయామ్ నాట్ ఇన్ డేంజర్, ఐయామ్ ది డేంజర్'.. బ్రేకింగ్ బ్యాండ్ వెబ్ సిరిస్ లో ఫేమస్ డైలాగ్ ఇది. ఇప్పుడిదే డైలాగ్‌ని గుర్తు చేసేలా నాని 'హిట్ 3' సినిమా అనౌన్స్ మెంట్ ఇచ్చారు. హిట్ ఫ్రాంచైజీలో శైలేష్ కొలను రెండు సినిమాలు తీశారు. ఆ రెండు మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు మూడో కేసులో నాని హీరో. అర్జున్ సర్కార్‌గా నాని పాత్రని పరిచయం చేస్తూ ఓ గ్లింప్స్ రిలీజ్ చేశారు. తను డేంజర్‌లో ఉన్నాడని ఓ అధికారి హెచ్చరిస్తే తనే ఓ డేంజర్ అని మరో అధికారి సమాధానం ఇవ్వడంతో నాని క్యారెక్టర్ రివిల్ కావడం ఆసక్తికరంగా వుంది. ఇందులో నాని ఇంటెన్స్ అండ్ వైల్డ్ గా కనిపించాడు. మంచు కొండల్లో తీసిన వీడియో లావిష్ గా వుంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం ఇంటన్సిటీని పెంచింది. నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని ఈ సినిమాని నిర్మిస్తున్నారు. హిట్ ఫ్రాంచైజీలో రెండు సినిమాలు బాక్సాఫీసు వద్ద మంచి రిజల్ట్ చూడటంతో ఈ సిరిస్ లో వస్తున్న మూడో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మే 1, 2025న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## బికినీలో లక్ష్మీ రాయ్ గ్లామర్ డోస్!!



లక్ష్మీరాయ్ సౌత్‌లోనే కాకుండా నార్త్‌లో కూడా చాలా సినిమాల్లో నటించింది. 2004లో శ్రీకాంత్ సరసన "కాంచనమాల కేబుల్ టీవీ" సినిమాతో ఆమె వెండితెరకు ఎంట్రీ ఇచ్చింది. కానీ, ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించకపోవడంతో ఆమెకు తెలుగులో పెద్ద అవకాశాలు దక్కలేదు. అయితే, రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన "కాంచన" సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. సినిమా ఘన విజయాన్ని సాధించడంతో లక్ష్మీ రాయ్ దక్షిణాది సినిమాల్లో బిజీ అయ్యింది. ఆమెకు పెద్ద అవకాశాలు రాకపోయినా, ముఖ్యంగా ఐటెం సాంగ్స్ లో నటిస్తూ అభిమానులను అలరించింది. రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ వంటి టాప్ హీరోలతో చేసిన పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఖైదీ నెంబర్ 150 "రత్తాలు" పాటతో మరో లెవెల్ క్రేజ్ అందుకుంది. అప్పటి నుంచి టాలీవుడ్ ఫ్యాన్స్ అదే పేరుతో పిలుస్తున్నారు. తన అందంతో, అభినయంతో లక్ష్మీ రాయ్ కుర్రాళ్ళ మనసు దోచుకుంటూ, సోషల్ మీడియాలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఆమె బికినీ ఫోటో షూట్స్, స్టైలిష్ లుక్స్‌తో అభిమానులకు దగ్గరయ్యింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లో బికినీ ఫోటోలతో మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. కొన్ని స్పెషల్ ఫోటోలను ఆమె షేర్ చేసుకుంది. ఇక సినిమా విషయానికి వస్తే, ఆమె ప్రస్తుతం ప్రభుదేవాతో కలిసి ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో అనసూయ కూడా ముఖ్య పాత్రలో కనిపించబోతోంది. లక్ష్మీ రాయ్, తన కెరీర్‌లో కొత్త అవకాశాలు, డిఫరెంట్ కంటెంట్ కలిగిన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని చూస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకంటే వైవిధ్యమైన పాత్రలు చేసేందుకు ఆమె ముందడుగు వేస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# సునీత భూమికి తిరిగి రాగలదా?



- రెండు నెలలుగా రోదసీలో చిక్కుకున్న ఇద్దరు ఆస్ట్రోనాట్లు
- వారి ప్రయాణాన్ని ఆరు నెలలు వాయిదా వేసిన నాసా
- ఫిబ్రవరిలోనే వారిని తీసుకురానున్నట్లు ప్రకటన
- శాస్త్రవేత్తలను వెంటాడుతున్న కల్పనాచావ్లా దారుణ ఉదంతం
- అందుకే రిస్క్ తీసుకోవడానికి వెనకాడుతున్న అమెరికా

– డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

**అంతరిక్ష పరిశోధనల్లో అమెరికా రాటుదేలిపోయింది. అసలు ఆ ప్రయోగాలు, పరిశోధనలకు ప్రపంచంలో తొట్టతొలిసారి శ్రీకారం చుట్టినవే అమెరికా, అవిభక్త రష్యా (యూఎస్ఎస్ఆర్) దేశాలు. అంతటి ఘనచరిత్ర కలిగిన అమెరికన్ స్పేస్ ఏజెన్సీ నాసాకే ప్రస్తుతం ఒక అంశం ముప్పుతిప్పలు పెట్టి చెమటలు పట్టిస్తోంది. రెండు నెలల క్రితం నాసా ఆధ్వర్యంలో ఇద్దరు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లారు. ఎనిమిది రోజుల్లో అక్కడ పరిశోధనలు పూర్తి చేసి భూమికి తిరిగి చేరుకోవాల్సిన వారు అనుకోని రీతిలో తలెత్తిన సమస్యలతో అంతరిక్షంలోనే చిక్కుకుపోయారు. వారిని వెనక్కి తీసుకురావడానికి నాసా శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. ఫలితంగా వారి తిరిగి రాక ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ రెండు నెలలు గడిచిపోయాయి. ఇప్పుడది ఏకంగా మరో ఆరు నెలలకు వాయిదా పడింది. తాజా సమాచారం ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు ఆస్ట్రోనాట్లను భూమిపైకి తీసుకొస్తామని నాసా ప్రకటించింది. దాంతో ఎనిమిది రోజుల అంతరిక్ష యాత్ర కాస్త ఎనిమిది నెలల యాత్రగా మారిపోయింది. అస్ట్రోనాట్లను తీసుకురావడానికి అమెరికా ఇంతగా ఇబ్బందిపడటానికి, వెనుకాముందు ఆలోచించడానికి ఒక కారణం ఉంది. గతంలో అమెరికన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోనే అంతరిక్ష యాత్ర చేసిన కల్పనాచావ్లా తిరుగు ప్రయాణంలో దారుణ మరణానికి గురి అయిన చేదు అనుభవం అమెరికన్ శాస్త్రవేత్తలను ఊగిసలాటకు, ఆందోళనకు గురిచేస్తోంది. ఎట్టకేలకు సునీతా విలియమ్స్‌ను ఫిబ్రవరిలో తీసుకురావడానికి నాసా ఫిక్స్ అయినా ఇంత సుదీర్ఘకాలం అంతరిక్షంలో ఉండటం వల్ల ఆస్ట్రోనాట్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారి మనుగడే ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.**

నిధులు, అంతరిక్షశాస్త్ర పరిజ్ఞానం విషయంలో ఎదురు లేని స్థితిలో ఉన్న అమెరికాకు చెందిన నాసా సంస్థ రెండు నెలల క్రితం అంతరిక్షంలోకి పంపిన సునీతా విలయమ్స్, బుచ్ విల్మోర్‌లను తిరిగి భూమిపైకి తీసుకురావడానికి నానాపాట్లు పడుతోంది. తీవ్రంగా తటపటాయిస్తోంది. అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించినా తుది నిర్ణయం తీసుకోలేకపోయింది. ఇంకోమాటలో చెప్పాలంటే సాహసం చేయలేకపోయింది. చివరికి ఆరునెలల తర్వాత అంటే వచ్చే ఫిబ్రవరిలో మరో స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపి సునీతా, విల్మోర్‌లను భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనివల్ల ఆస్ట్రోనాట్లు ఆరోగ్య సమస్యల్లో చిక్కుకుంటారని తెలిసినా వేరే గత్యంతరం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. నాసా ఇంతగా సతమతం కావడానికి గతంలో ఎదురైన ఒక చేదు అనుభవం భయపెడుతుండటమే కారణమని అంతరిక్ష రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో అమెరికా ప్రయోగించిన కొలంబియా స్పేస్‌క్రాఫ్ట్ అంతరిక్షంలో పరిశోధనలు ముగించుకుని భూమిపైకి వస్తుండగా పేలిపోయి అందులో ఉన్న కల్పనా చావ్లా సహా వ్యోమగాములందరూ చనిపోయిన ఉదంతం నాసా శాస్త్రవేత్తలను భయపెడుతోంది. ధైర్యంగా ముందడుగు వేయకుండా వెనక్కి లాగుతోంది. ప్రస్తుతం అంతరిక్షంలో చిక్కుకున్న సునీతా విలయమ్స్ మాదిరిగానే కల్పనాచావ్లా కూడా భారత మూలాలున్న అమెరికన్ ఆస్ట్రోనాట్. రెండు దశాబ్దాల క్రితం జరిగిన ఘోర ప్రమాదం పునరావృతం అవుతందేమోనన్న భయంతోనే నాసా ఒకటికి వెయ్యిసార్లు ఆలోచిస్తోంది.

### కల్పనా చావ్లా దారుణ మరణం

కల్పనాచావ్లా.. ఈ పేరు ఇప్పటి తరానికి పెద్దగా తెలియకపోవచ్చు. లేదంటే పోటీ పరీక్షల ప్రశ్నల్లో ఒక ప్రశ్నగా ఎవరికైనా ఎదురై ఉండవచ్చు. ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న సునీతా విలియమ్స్ మాదిరిగానే కల్పన కూడా భారత సంతతికి చెందిన మహిళ. పంజాబ్‌లోని కర్నాల్‌కు చెందిన ఆమె అక్కడే ఇంజినీరింగ్ చదివిన అనంతరం టెక్సాస్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్, కొలరాడో యూనివర్సిటీ నుంచి అదే కోర్సులో పీహెచ్‌డీ చేసింది. 1994లో నాసాలో అస్ట్రోనాట్‌గా ఎదిగింది. పలు అంతరిక్ష ప్రయోగాల్లో పాల్గొంది. అదే క్రమంలో 2003లో ఆమెరికా ప్రయోగించిన రోదసీ నౌక కొలంబియాలో మరికొందరు వ్యోమగాములతో కలిసి అంతరిక్ష యాత్రకు వెళ్లింది. అక్కడి ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్)లో కొన్ని రోజులు పరిశోధనలు చేసిన అనంతరం వ్యోమగాములు కొలంబియా స్పేస్‌క్రాఫ్ట్‌లో భూమికి తిరుగు ప్రయాణమయ్యారు. 2003 ఫిబ్రవరి ఒకటో తేదీన మరో 16 నిమిషాల్లో భూమిపై ల్యాండ్ కావాల్సిన కొలంబియా స్పేస్ షటిల్‌లో హఠాత్తుగా సాంకేతిక సమస్యలు తలెత్తి మొత్తం పేలిపోయింది. దీంతో కల్పనా చావ్లా సహా ఆరుగురు ఆస్ట్రోనాట్స్ దుర్మరణం పాలయ్యారు. అంతుకు ముందు 1986 జనవరిలో కూడా ఛాలెంజర్ స్పేస్ క్రాఫ్ట్ పేలిపోయి అందులో ఉన్న అస్ట్రోనాట్స్ చనిపోయారు. నాసా చరిత్రలో అతి పెద్ద డిజాస్టర్స్ ఈ రెండు ప్రయోగాలు. వీటిని దృష్టిలో ఉంచుకునే సునీతా విలియమ్స్ విషయంలో ఏ మాత్రం రిస్క్ తీసుకోవడానికి నాసా సుముఖత చూపడంలేదు.

### సునీత తిరిగి రావడంలో ఇబ్బందులు

కల్పనా చావ్లా మాదిరిగానే సునీతా విలియమ్స్ కూడా ఇండో అమెరికన్ అస్ట్రోనాట్. అంతరిక్షయానం చేసిన తొలి భారత సంతతి మహిళగా కల్పనా రికార్డు సృష్టిస్తే.. సునీతా విలియమ్స్(58) రెండో భారత సంతతి మహిళగా ఖ్యాతి గాంచారు. నాసా తరఫున అమె పలుమార్లు అంతరిక్ష యాత్ర చేశారు. అదేవిధంగా జూన్ ఐదో తేదీన కమాండర్ బ్యారీ విల్మోర్(61) అనే మరో ఆస్ట్రోనాట్‌తో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో 8 రోజుల అధ్యయనానికి వెళ్లారు. ప్రముఖ విమానాల తయారీ సంస్థ అయిన బోయింగ్ సంస్థ తయారుచేసిన స్టార్‌లైనర్ అనే స్పేస్‌క్రాఫ్ట్ వారిని ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లింది. స్టార్‌లైనర్ రోదసీలో ప్రయాణించడం ఇదే తొలిసారి కావడం విశేషం. అయినా విజయవంతంగా ఆస్ట్రోనాట్లను ఐఎస్‌ఎస్‌కు చేర్చింది. అయితే ఆ తర్వాత స్టార్‌లైనర్‌లో సమస్యలు మొదలయ్యాయి. స్పేస్‌క్రాఫ్ట్‌కు ఇంధనంగా వినియోగించే హీలియమ్ లీక్ కావడంతో పాటు స్పేస్‌క్రాఫ్ట్ ఎగరడానికి ఉపకరించే థ్రస్టర్స్, ప్రొపెల్ వాల్వ్ కూడా పనిచేయడం మానేశాయి. వాటికి నాసాలోని కంట్రోల్ రూము నుంచే బాగుచేసేందుకు శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో మరో స్పేస్ షటిల్‌ను పంపి సునీత, విల్మోర్‌లను తీసుకురావాలని నాసా నిర్ణయం తీసుకుంది. అయితే ఫిబ్రవరిలో గానీ ఇది జరిగే అవకాశంలేదు.

### ఇద్దరి కోసం కోట్లు ఖర్చు

ప్రత్యామ్నాయ స్పేస్ షటిల్ కోసం నాసా కోట్ల ఖర్చుకు సైతం సిద్ధమవుతోంది. ఆ మేరకు స్పేస్ ఎక్స్ సంస్థతో చర్చలు జరుపుతోంది. ఆ సంస్థకు చెందిన స్పేస్ ఎక్స్ క్రూ–9 రాకెట్‌ను పంపనున్నారు. ఇది 2025 ఫిబ్రవరిలో రోదసీలోకి వెళ్లనుంది. నిజానికి ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో స్పేస్ ఎక్స్‌కు చెందిన ఒక వ్యోమనౌక ఐఎస్ఎస్ వద్ద పార్క్ చేసి ఉంది. అది ఈ నెలలోనే భూమికి తిరిగి రానుంది. కానీ అందులో వెళ్లినవారే తిరిగి రానుండటంతో సునీతా, విల్మోర్‌కు చోటు దక్కలేదు. అలాగే మరో స్పేస్ షటిల్ సూయాజ్ కూడా అక్కడే ఉంది. అందులో కూడా రష్యన్ ఆస్ట్రోనాట్స్ తిరిగి రావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరిలో ప్లాన్ చేసిన ఫిబ్రవరిలో పంపే వ్యోమనౌకే గత్యంతరంగా మారింది. వాస్తవానికి ఇందులో నలుగురు అస్ట్రోనాట్స్ ఐఎస్ఎస్‌కు వెళ్లాల్సి ఉంది. కానీ సునీతా, విల్మోర్‌ల కోసం ఇద్దరిని మాత్రమే పంపుతున్నారు. తిరుగు ప్రయాణంలో నలుగురు వస్తారు. అలాంటప్పుడు సునీత, విల్మోర్‌లను తీసుకెళ్లి రోదసీలోనే రిపేర్‌కు వచ్చిన స్టార్‌లైనర్ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తవచ్చు. దానికి ప్రత్యామ్నాయ ప్రణాళికను నాసా సిద్ధం చేసింది. దాన్ని ఈ నెల ఆరో తేదీనే ఆస్ట్రోనాట్లు లేకుండా ఖాళీగానే భూమి మీదకు తీసుకురానున్నారు. ఆరుగంటల ప్రయాణం తర్వాత అది న్యూ మెక్సికోలోని వైట్ సాండ్స్ స్పేస్ హార్బర్‌లో ల్యాండ్ కానుంది. ఈ ప్రక్రియ మొత్తం రిమోట్‌తోనే జరగనుంది.

### ఆస్ట్రోనాట్ల ఆరోగ్యంపై ప్రభావం

ఈ పరిస్థితుల్లో అంతరిక్షంలో చిక్కుకున్న సునీత, విల్మోర్‌ల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉంటే వ్యోమగాములకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అక్కడి వాతావరణానికి, భూమిపై ఉండే వాతావరణానికి చాలా తేడా ఉంటుంది. అందుకే వ్యోమగాములను నిర్ణీత కాలపరిమితితోనే, తగిన ఆరోగ్య ఏర్పాట్లతో అంతరిక్షంలోకి పంపిస్తుంటారు. కానీ ఊహించని విధంగా సాంకేతిక సమస్యలు ఏర్పడి ఎనిమిది రోజుల్లో తిరిగి రావాల్సిన సునీత, విల్మోర్‌లో ఇప్పటికే రెండు నెలలుగా అంతరిక్షంలో ఉండిపోయారు. దాంతో సునీతా విలియమ్స్ ఆరోగ్యం క్షీణిస్తోందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. ఆమెకు కంటి చూపు క్షీణిస్తుంది. అంతరిక్ష ప్రయాణాలు చేసేవారికి ఎక్కువగా న్యూరో ఒకులార్ సింద్రోమ్ అనే సమస్య ఎదురవుతుంది. దీనివల్ల కంటి చూపు క్షీణిస్తుంది. అంతరిక్షంలో ఉన్నప్పుడు మైక్రో గ్రావిటీ వల్ల ఈ సమస్య ఎదురవుతుందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చీఫ్ ఎస్ సోమనాథ్ తెలిపారు. అలాగే సునీతా విలియమ్స్ శరీర ఎముకల బలం కూడా తగ్గిపోతోందని తెలిసింది. ఆమె ఎముకల్లో సాంద్రత తగ్గిపోయిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏకంగా మరో ఆరు నెలలు అంతరిక్షంలో ఉండిపోతే సునీత, విల్మోర్‌ల ఆరోగ్యంపై ఇంకెటువంటి ప్రభావం పడుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు వారిద్దరూ క్షేమంగా భూమికి తిరిగి రాగలరా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

---

# సర్వమత హితైషి.. సర్వేపల్లి



-విద్యావేత్తే కాదు రాజనీతిజ్ఞుడు, తత్వవేత్త -ప్రపంచ గురువుగా ఆయన ఖ్యాతి విశ్వవ్యాప్తం -జీవన తత్వాన్ని బోధించిన మహనీయుడు -ఆయన్ను స్మరించుకోవడమే గురుపూజోత్సవ లక్ష్యం

ఆయన అధ్యాపకుడు, తత్వవేత్త, రచయిత, రాజనీ తిజ్ఞుడు, సర్వమతాల సారాన్ని ఔపోసన పట్టిన ఆధ్యాత్మికవేత్త, నిత్య అన్వేషకుడు, నిరంతర జ్ఞానపిపాసి.. ఆయన మరెవరో కాదు విశ్వగురువుగా పేరెన్నికగన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. అసాధారణ ప్రజ్ఞాశాలిగా ప్రఖ్యాతి పొందిన ఆయన భారత అత్యున్నత పదవులైన ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవులను సైతం అలంకరించి భారతరత్నగా భాసిల్లిన నిత్యకృషీవలుడు. అందుకే ఆ మహనీయుడి జయంతి రోజైన సెప్టెంబర్ ఐదో తేదీన ప్రతి ఏటా గురుపూజోత్సవం నిర్వహించుకుంటూ ఆయన్ను స్మరించుకుంటుంటాం. ప్రతిఒక్కరూ తమ గురువులను శక్తిమేరకు, శ్రద్ధాభక్తులతో సత్కరించుకోవడం ద్వారా డాక్టర్ సర్వేపల్లికి నివాళులర్పిస్తుంటారు. ఈయన అప్పటి మద్రాసు రాష్ట్రం.. ప్రస్తుత తమిళనాడులోని తిరుత్తణిలో జన్మించినా.. వీరిది అచ్చతెలుగు కుటుంబం. తండ్రి సర్వేపల్లి వీరాస్వామి, తల్లి సీతమ్మ. వీరిది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సర్వేపల్లి గ్రామం. మాతృభాష కూడా తెలుగే. తహసీల్దారుగా పని చేసిన వీరాస్వామి ఉద్యోగరీత్యా పలు ప్రాంతాల్లో పనిచేసేవారు. ఆ క్రమంలోనే అప్పటి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న తిరుత్తణిలో పని చేస్తున్నప్పుడు 1888 సెప్టెంబర్ ఐదో తేదీన వీరాస్వామి దంపతులకు రాధాకృష్ణన్ జన్మించారు. అతని బాల్యం, పాఠశాల విద్యాభ్యాసం తిరుత్తణి, తిరుపతిల్లో సాగింది. మద్రాస్ క్రిష్టియన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో అధ్యాపకుడిగా, మైసూర్, కలకత్తా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

### ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వెలుగు

దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన విశాఖలోని ఆంధ్ర విశ్వకళాపరిషత్(ఏయూ) సర్వేపల్లి హయాంలోనే ఒక వెలుగు వెలిగింది. అంతకుముందు కలకత్తా విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న సమయంలోనే భారతీయ తత్వశాస్త్రం అనే గ్రంథాన్ని రచించారు. లండన్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రాచ్యతత్వశాస్త్రంపై ఉపన్యాసాలు ఇచ్చారు. అలాగే ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాల్లో అనేక అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చి మన దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఘనత డాక్టర్ సర్వేపల్లికే దక్కుతుంది. 1931లో విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండో వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. తన హయాంలో ఆ విశ్వవిద్యాలయం బహుముఖంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. బొబ్బిలిరాజా సహకారంతో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు చేశారు. అలాగే సైన్స్‌కు సంబంధించిన పలు కోర్సులు ప్రారంభించారు. యూనివర్సిటీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ టెక్నాలజీతో పాటు తత్వశాస్త్ర విభాగాలు ప్రారంభించి ఆయా కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులకు వసతి కల్పిస్తూ హాస్టల్స్, విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు, వర్సిటీ సిబ్బంది నివాసానికి క్వార్టర్స్, ఆధునిక తరగతి గదుల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఫలితంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించింది. తర్వాత కాలంలో ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించినా ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మర్చిపోలేదు. అక్కడి జరిగే పలు కార్యక్రమాలకు హాజరయ్యేవారు. అతిపురాతనమైన బెనరాస్ హిందూ విశ్వవిద్యాలయానికి కూడా 1939–48 మధ్య వైస్‌ఛాన్సలర్‌గా సేవలు అందించారు. రష్యాలో భారత దేశ రాయబారిగా, తొలి జాతీయ విద్యాకమిటీ చైర్మన్‌గా, యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) చైర్మన్‌గా విశిష్ట సేవలు అందించిన సర్వేపల్లి దేశంలో ఉన్నత విద్యారంగానికి దిశానిర్దేశం చేసి దాని వ్యాప్తికి బాటలు వేశారు.

### మొదటి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి


విద్యారంగానికే తొలినుంచీ అంకితమైన డాక్టర్ సర్వేపల్లి దేశ స్వాతంత్ర్యోద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించారు. ఉద్వేగభరిత ప్రసంగాలతో యూనివర్సిటీ విద్యార్థులను, ఉద్యమకారులను ఉత్తేజపరిచి స్వాతంత్ర్య కాంక్షను రగిలించేవారు. స్వాతంత్ర్యానంతర మన దేశానికి సొంత రాజ్యాంగం రూపొందించేందుకు ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిషత్‌లో కూడా సభ్యుడిగా ఉన్న సర్వేపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహామహులతో కలిసి దేశానికి సొంత రాజ్యాంగాన్ని అందించారు. స్వాతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా బాబు రాజేంద్రప్రసాద్ ఎన్నిక కాగా.. తొలి ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ 1952 మే 13న బాధ్యతలు చేపట్టారు. తన తొలి టెర్మ్ ఐదేళ్లు పూర్తి అయిన తర్వాత రెండోసారి కూడా ఆయన్నే ఉపరాష్ట్రపతిగా ఎన్నుకోవడం విశేషం. ఆ విధంగా 1952 నుంచి 1962 వరకు పదేళ్లు ఉపరాష్ట్రపతిగా సేవలందించిన సర్వేపల్లి.. బాబు రాజేంద్ర ప్రసాద్ తర్వాత భారత రెండో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1962 నుంచి 1967 వరకు ఆ పదవిలో కొనసాగారు.

### నిత్య సత్యాన్వేషి

అధ్యాపకుడిగా, ప్రొఫెసర్‌గా, వైస్ ఛాన్సలర్‌గా, తత్వవేత్తగా వేలాది విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచిన డాక్టర్ సర్వేపల్లి అందించిన బహుముఖ సేవలను గుర్తించిన ప్రపంచంలోని పలు విశ్వవిద్యాలయాలు ఆయన్ను గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం ద్వారా తమను తాము గౌరవించుకున్నాయి. దేశానికి, విద్యారంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న అవార్డుతో సర్వేపల్లిని సత్కరించింది. అన్నింటికీ మించి సర్వేపల్లి ఆధ్యాత్మికవేత్తగా అద్వైత వేదాంతిగా ఖ్యాతి గాంచారు. దృష్టిలో మతం అంటే శాంతి, సత్యం కోసం నిత్య అన్వేషణ సాగించడమే. హిందూ, క్రిష్టియన్, ముస్లిం మత గ్రంథాలైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లను అమూలాగ్రం చదివి ఆకళింపు చేసుకున్న అద్వైత వేదాంతి ఆయన. సర్వమతాలు సమానమన్న విశాల దృక్పథంతో ఉదారవాదాన్ని నమ్మేవారు.. దాన్నే ప్రబోధించేవారు. ఉపనిషత్తులు బుద్ధుడి బోధనలను అనుసరిస్తూ వాటిని జీవన విధానానికి అన్వయించుకుంటూ తత్వశాస్త్రాన్ని బోధిస్తూ తాత్వికుడిగా మనదేశానికే కాకుండా ప్రపంచానికి మార్గదర్శనం చేసిన సర్వజ్ఞాని సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17న తుది శ్వాస విడిచారు. ఆయన మన మధ్య లేకున్నా ప్రతి ఏటా గురుపూజోత్సవం ద్వారా ఆయన మనమధ్యకు వస్తూనే ఉన్నారు.

– డాక్టర్ పద్మ పానుగోటి, ఫ్రీలాన్సర్

---



12వ డివిజన్ యూత్ లీడర్ దేవెళ్ల విస్సు, నంద ఆధ్వర్యంలో పుణ్యపువీధి ఎంఈ స్కూల్, నానుబాలవీధి ప్రతిభ కాలేజ్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేసిన శాలువ, కొబ్బరి మొక్కలతో పాటు సన్మాన పత్రాలు ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జిలు ఇప్పిలి తిరుమలరావు, తాళ్లూరు నవీన్, తెలుగుదేశం నాయకులు నాగరాజు, తెలుగు యువత, టీడీపీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్














# సిక్కోలు నషాళానికి గంజాయి నిషా!

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం కాదు. గంజాయి బ్యాచ్ వల్ల సమాజమే కాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా బాధితులుగా మారిపోతున్నారు. నిత్యం ఏదో ఒక గొడవ తేవడం, కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరగడం సర్వ సాధారణమైపోయింది. గంజాయి ఎవరు అమ్ముతున్నారు, ఎవరు కొంటున్నారు, ఎక్కడెక్కడ సేవిస్తున్నారన్న వివరాలు పోలీసులకు తెలియనివి కావు. కాకపోతే అదిలించి నడిపించేవారు లేక మనకెందుకులే అన్నట్లు మిన్నకుండిపోయారు. శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐగా విజయ్‌కుమార్ పని చేసిన తొలిరోజుల్లో తన స్టేషన్ పరిధిలో గంజాయి దందాలపై ఉక్కుపాదం మోపారు. ఆ తర్వాత ఏమైందోగానీ వన్‌టౌన్ పరిధిలోనే గంజాయి సేవనం, అమ్మకాలు పెరిగిపోయాయి. వాటి ప్రభావంతో క్రైమ్ రేట్ కూడా పెరిగింది. గతంలో మాదిరిగా స్టూవర్ట్ పురం నుంచో, మరో రాష్ట్రం నుంచో దొంగలముఠా రావడం, ఇళ్లు కొల్లగొట్టడం అనే రివాజు పోయి స్థానిక గంజాయిబాబులే ఇళ్ల గజాలు వంచేసి చోరీలకు పాల్పడిన సందర్భాలు కనిపిస్తున్నాయి.

### వలంటీరే రింగ్ మాస్టర్

గంజాయి దందాలను అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ నియమించిన ప్రత్యేక సిబ్బంది గత కొద్ది రోజులుగా అదుపులోకి తీసుకుంటున్న వ్యక్తుల నుంచి కీలక సమాచారం రాబట్టినట్టు భోగట్టా. ఇందులో భాగంగా నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఒక యువకుడి ఇంట్లో సోదాలు చేసి రెండు ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు లాగుతున్నారు. కొన్నాళ్లు కొరియర్ బాయ్‌గా పనిచేసిన ఈ యువకుడు చాలా రోజులుగా పనీపాటా లేకుండా పోకిరీ వేషాలు వేస్తుండేవాడని, ఆయన తండ్రి స్క్రాప్ కొనుగోలు చేసి విక్రయిస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. ఈ యువకుడిగా స్నేహ బృందంగా ఉంటున్న మండలవీధి, కత్తెరవీధి, కర్రావీధి, రెడ్డికవీధి, చల్లవీధికి చెందిన సుమారు 60 మంది రోజూ సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు డీఈవో కార్యాలయం రోడ్డులోనే ఉంటూ హడావుడి చేస్తుంటారు. దాంతో సాయంత్రం ఏడు తర్వాత ఆ రోడ్డు మీదుగా ఒంటరిగా వెళ్లడానికి ఎవరూ సాహసించరు. వీరందరిపైనా అనేక అభియోగాలతో వన్‌టౌన్, రూరల్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. అందరికీ అంతో ఇంతో నేరచరిత్ర ఉంది. డీఈవో కార్యాలయ పిట్టగోడలపై కూర్చోనే ఈ బ్యాచ్‌ను రెడ్డిక వీధికి చెందిన ఒక వలంటీర్ లీడ్ చేస్తుంటాడని తెలిసింది. రాజకీయ పార్టీల ర్యాలీలకు, సమావేశాలకు వీరందరినీ ఆ వలంటీరే తీసుకొని వెళ్లి వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చుతుంటాడన్న ప్రచారం ఉంది. బ్యాచ్ పేరు చెప్పి పలుకుబడిన వ్యక్తుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మహాలక్ష్మీనగర్ కాలనీలో రెండు ప్యాకెట్ల గంజాయి చిక్కిన నేపథ్యంలో వలంటీర్ బ్యాచ్ అలెర్ట్ అయింది. తోటపాలెం వద్ద దొరికిన ఈ బ్యాచ్‌లో అందరూ సేవించేవారే అనుకున్నారు. పోలీసులకు చిక్కిన తర్వాత బ్యాచ్‌లో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. గతంలో గంజాయి సేవించినవారినే పట్టుకున్నారు తప్ప అమ్ముతున్నవారిని పట్టుకోలేదు.

### మూలాలు పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యం

జిల్లాలో అక్కడక్కడా గంజాయి అమ్మకందారులు చిక్కినా మూలాలు కనిపెట్టడం పోలీసులకు సాధ్యం కాలేదు. జలుమూరు మండలంలో గత ఏడాది గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలిని అదుపులోకి తీసుకొని ఆమె ఇచ్చిన సమాచారం మేరకు ఒడిశాలోని బాధ్యుడిని సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నా మూలాలను గుర్తించలేకపోయారు. గంజాయి అక్రమంగా తరలించేవారు, విక్రయించేవారు చిక్కినా వారి నుంచి సమాచారం రాబట్టడం అంత సులువు కాదు. వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతూ సాంకేతికతను వినియోగిస్తూ ఫోన్ డేటా బయటకు రాకుండా ఎప్పటికప్పుడు నెంబర్లు మార్చుతుంటారు. తరచూ ప్రాంతాలను కూడా మార్చేస్తూ కొత్త ప్రాంతాల్లో డీల్ కుదుర్చుకుంటారు. ఒకవేళ పోలీసులకు చిక్కినా గంజాయి ఎక్కడి నుంచి దిగుమతి చేసుకున్నారన్న విషయం బయటపెట్టరు. ఒకవేళ బయటపెట్టినా సదరు బాధ్యుడు చిక్కడు. ఒకవేళ పోలీసులకు ఎవరైనా దొరికితే మిగతా వారందరూ అలెర్ట్ అయిపోతున్నారు. గంజాయి కేసుల్లో మూలాలు కనుగొనడం ఇప్పటికీ సాధ్యం కాలేదంటే వారంతా ఎంత పక్కా ప్రణాళికలతో వ్యవహరిస్తుంటారో అర్థమవుతుంది. గంజాయి మూలాలన్నీ ఒడిశాలోనే ఉన్నాయని తెలిసినా అక్కడకు వెళ్లి బాధ్యులను తీసుకురావడం అసాధ్యం. ఒడిశా పోలీసులు అన్ని సందర్భాల్లో ఆంధ్రా పోలీసులకు సహకరించరు. వారు సహకరించకపోతే నిందితులను గుర్తించడం సాధ్యంకాదు. దీంతో గంజాయితో పట్టుడినవారిని పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసి 90 రోజులు జైల్లో ఉంచి తర్వాత బెయిల్‌పై విడుదల చేయడం.. పెడదారిపట్టిన యువతకు కౌన్సెలింగ్ నిర్వహించి విడిచిపెట్టేయడం చేస్తున్నారు.

## పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



పోషక విలువులున్న ఆహారం తీసుకోడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ శ్రీకాకుళం ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి అన్నారు. కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని గొంటి వీధి, రెడ్డికవీధి, సాయిబులతోట, పుప్పాల వారివీధి, బాకర్‌సాహెబ్‌పేట 1, 2, కర్రావీధి, మసీదుపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం పోషకాహార వారోత్సవాలు జరిగాయి. పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి కేంద్రాల్లో పోషకవిలువలున్న పదార్థాలతో తయారుచేసిన పదార్థాల ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జిలు రమణ మాదిగ, పట్నాల పార్వతీశం, అడ్మిన్ కిశోర్ కుమార్, ఆర్పీ గౌరి, ఏఎన్ఎం యమున, ఆశా శశికళ, అంగన్వాడీ కార్యకర్తలు నళిని, చిరంజీవి, హైమావతి, మంగవేణి, లక్ష్మీ, దీప, భానుమతి, వామాక్షి, ఆయాలు రబియా బసిర్, లక్ష్మీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలనే వాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

(సత్యంన్యూస్, రాజాం)




మట్టి గణపతి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడాలని రాజాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కోండ్రు జగదీష్, జీఎంఆర్ ఆర్ వరలక్ష్మి కేర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డి.రాజేంద్ర అన్నారు. గురువారం రాజాం మార్ట్ వద్ద వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయకుల పంపిణీకి ముందుకు వచ్చిన రాజాం మార్ట్ యజమాని కడగల నాగరాజును వారు అభినందించారు. కార్యక్రమంలో వికాసతరంగిణి ప్రతినిధులు తిరుమల రంగనాథం, టిటివి రమణ మూర్తి, వాకచర్ల పైడిరాజు, గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాష్, దుప్పల పూడి శ్రీనివాస్, పొట్నూరు లక్ష్మణరావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్‌కుమార్, సత్యంనాయుడు, రవి, సోమశేఖర్ పాల్గొన్నారు.

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం తరపున న్యూ సెంట్రల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ, రేణుక దంపతులు ఆధ్వర్యంలో ఆరవెల్లి చేతన్ విజయ్ చేతుల మీదగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యూ సెంట్రల్ స్కూల్ యాజమాన్యం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం




## రైతుల సమస్యలపై దశలవారీ ఉద్యమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతులు, కౌలురైతులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9 నుంచి నిర్వహించే దశల వారి ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.చందర్రావు, కె.మోహన్‌రావు, ఆంధ్రప్రదేశ్ కవులు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఉద్యమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికలలో హామీ ఇవ్వడాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్ ప్రారంభమై మూడునెలలు గడిచినా హామీ ఇప్పటికీ అమలు జరగలేదన్నారు. రైతు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 20వేలు వెంటనే రైతు ఖాతాలలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వంశధార, నారాయణపురం ఆనకట్ట, మడ్డువలస, ఆఫ్‌షోర్ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.




## విద్యార్థులందరూ రేపటి తరం గురువులే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విద్యార్థులందరూ రేపటి తరం గురువులేనని ఎస్సీ ఎస్టీ బీసీ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారంపేటలోని నగర కార్పోరేషన్ ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం బి.రాంబాయి, ఎస్‌జీటీలు డి.శైలజ, వై.సుజాతలను ఎస్సీ, ఎస్టీ, బీసీ జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పిన్నింటి అప్పన్న, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.మూర్తి, నాయకులు బలగ మోహన్, తిర్లంగి రామకృష్ణ, కుమార్, ఆకుల కృష్ణ, బమ్మిడి వేణుగోపాల్, గుణ, భైరి శ్యాంసుందర్, స్పందన బాల, సీహెచ్ గణపతి తదితరులు పాల్గొన్నారు.




## సీఎం సహాయనిధికి పదివేల ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. పదివేల ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు విశ్రాంత తహశీల్దార్ సిహెచ్ సుభాషిని అందజేశారు. రిటైర్డ్ రెవిన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంతరావుతో కలిసి బుధవారం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సర్వం కోల్పోయి వీధిన పడిన వారిని ఆదుకునేందుకు తన వంతుగా సీఎం సహాయ నిధికి ఈ మొత్తాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.



## కర్ణాటకలో సత్తా చాటిన ఉద్దానం బాలిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మందస మండలం, మల్లేనవారిపేట గ్రామానికి చెందిన మల్లేన హాసిని కబడ్డీలో అండర్-12విభాగంలో రాణించి సిక్కోలు కీర్తిని చాటింది. కర్ణాటకలోని బళ్ళారిలో అండర్-12 కబడ్డీ చాంపియన్ పోటీల్లో తనదైన శైలిలో రాణించి ఏడు జట్టులను వరుసుగా ఓడించి ప్రథమ బహుమతి అందుకోవడంలో కీలకభూమిక పోషించింది. దీనిపై ఉద్దానం ప్రజలు హాసినీ ప్రతిభను కొనియాడారు.

## మాకివలస భూమిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

(సత్యంన్యూస్, జలుమూరు)

మండల పరిధిలోని ఎస్‌టీ మాకివలస గ్రామంలో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి సుమారు 104.46 ఎకరాల గిరిజన భూమి గిరిజనేతరులు దురాక్రమణలో ఉందని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఇండిజినస్ లాయర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎల్ఎఐ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ డాక్యుమెంటేషన్‌తో గిరిజనుల భూమిని అక్రమంగా ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గిరిజనులకు చెందిన 104.46 ఎకరాల భూమిని ఆక్రమించుకోవడానికి మండలస్థాయిలో రెవెన్యూ అధికారులు సహకరించి నకిలీ పత్రాలు సృష్టించారని వివరించారు. ఆక్రమణలపై గిరిజన సంఘం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టడం లేదని వివరించారు. మండలస్థాయిలో రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులుతో కుమ్మక్కయ్యారని పేర్కొన్నారు.

## బాలరాజు కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.**

(సత్యంన్యూస్, టెక్కలి)



సంతబొమ్మాళి మండలం గొల్ల సీతాపురం గ్రామానికి చెందిన బొమ్మాళి బాలరాజు కుటుంబ సభ్యులు బాలరాజు అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల బాలరాజు టెక్కలిలో విద్యుత్‌స్తంభం నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం పట్టణంలో మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ చేతుల మీదుగా 500 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ బీవీ అచ్యుత్‌కుమార్, వికాస తరంగిణి టీవీవీ రమణమూర్తి, మక్క అప్పలనాయుడు, దాసరి సురేష్, గట్టి పాపారావు, అబ్బులు, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ పాల్గొన్నారు.




## సీపీఎం విరాళాల సేకరణ




(సత్యం న్యూస్,శ్రీకాకుళం)

విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూ.41,748లు విరాళాలు సేకరించి పార్టీ రాష్ట్ర కేంద్రానికి పంపినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరద బాధితుల సహాయనిధికి విరాళాలు ఇచ్చిన వారందరికీ పార్టీ జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## అజ్ఞాన తిమిరాలను తొలగించేవారే గురువు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

విద్యార్థుల్లోని అజ్ఞాన తిమిరాలను తొలగించేవాడే గురువని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేట గ్రామం, శ్రీకాకుళం ఠాగూర్ పబ్లిక్ స్కూల్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 5వేల మంది ఉపాధ్యాయులను గురువారం సాలువాతో సత్కరించి సర్టిఫికెట్లను, మెమొంటోలను అందజేశారు. ముందుగా పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మన గమ్యానికి దారి చూపించేవాడు, మనకు తెలియని విషయాన్ని చెబుతూ జ్ఞాన సంపన్నులను చేసేవాడు గురువని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించినవారిని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం అభినందించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో గుజ్జల వర్షిత మూడు బంగారు పతకాలు సాధించింది. ఆడవరం గ్రామానికి చెందిన ఈమె 64కిలోల విభాగంలో స్నాచ్ 80, క్లీన్ & జెర్క్ 106 చేసింది. వర్షితకు స్ట్రాంగ్ ఉమెన్, బెస్ట్ లిఫ్టర్ అవార్డు కూడా లభించింది. బూరవెల్లి గ్రామానికి చెందిన దుబ్బ హేమశ్రీ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, జూనియర్ భాగంలో సిల్వర్ మెడల్స్ సాధించింది.



## విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులు గురువులు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులు వెలిగించేవారు గురువులని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిలో రాతలతో భవిష్యత్‌కు బాటలు వేసేది గురువులేనని స్పష్టం చేశారు. గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః అనే నామాన్ని కేవలం గురువులకు మాత్రమే దక్కుతుందన్నారు. ఆశయాలు కొనసాగింపుకు నేటితరం యువత పయనించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. కార్యమ్రకంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎస్. జోగినాయుడు, ఎపీ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బివిరవిశంకర్, బి.దేవీప్రసాద్ వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీ స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, గోర్లె వాసుదేవరావు, గుడ్ల జగ్గారావు, డాక్టర్ గజెల్స్ వాసుదేవ్, రిటైర్డ్ ఎంఈవో సింహాచలం, చదువుల బసవరాజు, బొడ్డేపల్లి ప్రసాద్‌రావు, పూన్న నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.